క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాలలో గణితం సర్టిఫికెట్ కోర్సులు



గణితం కోర్సుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో నూతన విద్యా సంవత్సరంలో రెండు గణితం సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. వాటికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. మ్యాథమెటిక్స్ ఫర్ మిషన్ లేర్నింగ్, ఇంట్రడక్షన్ ఇన్ మాట్ లాబ్ అనే కోర్సులను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, భవిష్యత్తులో ఉన్నత విద్యావకాశాలతో పాటు ఉపాధిని పొందడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల గణిత శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎ.అన్నపూర్ణ, అకడమిక్ సెల్ సమన్వయకర్త డాక్టర్ సంజీవ్, ఇతర గణిత శాఖ అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనపై దృష్టి సారించాలి



వేడుకల్లో మాట్లాడుతున్న పాఠశాల విద్యాశాఖ జోన్-2 ప్రాంతీయ సంచాలకులు నాగమణి

రాజమహేంద్రవరం రూరల్: లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనకు కృషి చేయాలని ఛాత్రోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ జోన్ – 2 ప్రాంతీయ సంచాలకులు జి.నాగమణి సూచించారు. బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో వార్షిక దినోత్సవం, 2022–24 బ్యాచ్ వీడ్కోలు కార్యక్రమాన్ని గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జి.నాగమణి మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు నిరంతరం శ్రమించి రాబోయే డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఏదో ఒక ఉద్యోగం వచ్చిందని అనుకోకుండా, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రాంతీయ సంచాలకులు నాగమణిని ఆదర్శంగా తీసుకుని తాను పయనిస్తున్నానని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ అన్నారు. సీనియర్ లెక్చరర్ కేవీ సూర్యనారాయణ వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ వీరభద్రరావు ఆధ్వర్యంలో ఛాత్రోపాధ్యాయులకు నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులను ఆర్జేడీ నాగమణి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కాంగ్రెస్ ప్రచారం

కడియం: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ గురువారం మాధవరాయుడుపాలెం, దామిరెడ్డిపల్లి, దుళ్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

80 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం సెబ్ సౌత్ స్టేషన్ పరిధిలోని గురువారం విస్తృత దాడులు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ పి.హసుశ్రీ తెలిపారు. రాజానగరం మండలం భూపాలపట్నానికి చెందిన సిద్దబత్తుల సూర్యారావు, కవలగొయ్యికి చెందిన మేడిశెట్టి గణేష్‌ను అరెస్టు చేసి రెండు కేసులు నమోదుచేశామన్నారు. వారి నుంచి 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1720 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

సచివాలయ భవనం పరిశీలన

ధవళేశ్వరం: గ్రామంలోని సచివాలయం–4 భవనాన్ని గురువారం జిల్లా పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ మహ్మద్ అలీముల్లా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన టెక్నికల్ పాయింట్లను వివరించారు. ఆయన వెంట ఏఈ ఏ.సంపత్ కుమార్ ఉన్నారు.

సినిమాలు

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	ది ఫాల్‌గమ్
సూర్యప్యాలెస్	సబారి
శివజ్యోతి	గీతాంజలి మళ్ళీ వచ్చింది
అనుశ్రీ	మంజుమ్మల్‌బాయ్స్
ఊర్వశి	ప్రసన్న వదన
రంభ	బాక్
మేనక	రత్నం
అప్సర	టిల్లు స్క్వేర్
కుమారి	సబారి, టిల్లుస్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	ఆ ఒక్కటీ అడక్కు
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	గాడ్జిల్లా అండ్‌కాంగ్, సబారి
కడియం	
వెంకటసూర్య	ఆ ఒక్కటీ అడక్కు

రైతులకు అన్నివిధాలా భరోసా

- అర్‌బీకేల ద్వారా విస్తృత సేవలు
- సాగుకు పెట్టుబడి సాయం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

రాజమహేంద్రవరం రూరల్: నాడు టీడీపీ ప్రభుత్వంలో రైతులు సమస్యలను చెప్పుకోవడానికి చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. సాగు సమయంలో ప్రకృతి కరుణించి వర్షాలు పడినా పెట్టుబడి రుణాలు కోసం రైతులు నానా అవస్థలు పడేవారు. ఎరువులు, పురుగు మందుల కోసం వ్యయప్రయాసలకు లోనయ్యేవారు. ఈ అడ్డంకులన్నింటినీ దాటినా ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చేసరికి దళారులతో ఇక్కట్లు తప్పేవి కావు. నాటి టీడీపీ ప్రభుత్వ పెద్దలు ఏకంగా వ్యవసాయం దండగని తేల్చేశారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలబడి వ్యవసాయమంటే నూరేళ్ల పండుగగా మార్చి చూపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలతో కలుగుతున్న లబ్ధిని చూసి అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తొర్రేడులోని రైతుభరోసా కేంద్రం

అన్ని సేవలు ఒక్క చోటే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంట్లో సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిబ్బందిని గ్రామ వ్యవసాయ సహాయకులుగా నియమించారు. స్థానికంగా రైతులకు ఏ సమస్య వచ్చినా సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కారమయ్యేలా చూస్తున్నారు. రైతులకు అవగాహన పెరిగేలా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను రాయితీపై అందిస్తున్నారు. రైతుల పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర అందించి దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేశారు. రైతుకు సాగుకు ఉపయోగపడేలా యంత్ర పరికరాలను రాయితీపై అందించారు. మరోవైపు ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి కోసం రైతుభరోసాగా ఏటా రూ.13,500 నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తుంది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 7,900 మంది రైతులకు ఐదు విడతల్లో రూ.5.35 కోట్లు రైతుభరోసాగా అందించారు. ఉచిత పంటల బీమా పరిహారం రూపేణా 1,133 మంది రైతులకు రూ.1.73 కోట్లు అందజేశారు. 22 మందికి, నాలుగు క్లస్టర్ గ్రూప్‌లకు సంబంధించి రూ.86.62 లక్షల విలువైన యంత్ర పరికరాలు సమకూర్చారు.

పెట్టుబడికి ఉపయోగం



ప్రభుత్వం ఏటా రైతుభరోసాగా అందిస్తున్న సాయం పెట్టుబడికి బాగా ఉపయోగపడుతోంది. ప్రభుత్వం ఇప్పటివరకూ రూ.67,500ను నాకు రైతుభరోసాగా జమచేసింది. రైతులను సకాలంలో ఆదుకునే విధానాన్ని జగనన్న ప్రభుత్వంలోనే చూస్తున్నాం.

– మిరియం నెహ్రూ, రైతు, తొర్రేడు

ఎన్నికల పరిశీలకుని పర్యటన



పొట్టిలంకలో సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు బాలసుబ్రహ్మణ్యం

కడియం: మండలంలోని పొట్టిలంక సచివాలయం 2ను ఎన్నికల పరిశీలకుడు కె.బాలసుబ్రహ్మణ్యం గురువారం సందర్శించారు. ఎన్నికల నిర్వహణ, కార్యాచరణకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పొట్టిలంకలోని మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కడియపులంకలోని శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించారు. ఆయన వెంట జేసీ తేజ్ భరత్, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, తహసీల్దార్ రమాదేవి, పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం



భరత్‌రామ్, గూడూరి శ్రీనివాస్‌కు హారతి ఇస్తున్న మహిళలు

- చంద్రబాబును నమ్మితే నష్టమే
- ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని 1, 50వ డివిజన్లలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 2014 ఎన్నికలలో చంద్రబాబు వందల కొద్దీ హామీలను ప్రజలకు ఇచ్చారని, నెగ్గిన తర్వాత ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. సీఎం కుర్చీ తప్పిస్తే ప్రజలూ, రాష్ట్రం ఏమైపోయినా చంద్రబాబుకు అక్కర్లేదన్నారు. 2014లో ఎంపీగా మురళీమోహన్ నెగ్గారని, ఆయన చేసిందేమీ లేదన్నారు. 2019 ఎన్నికలలో టీడీపీ ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి భవాని గెలిచినా నగరంలో ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. కరోనా సమయంలో ప్రజలు ప్రాణభయంతో అల్లాడుతుంటే ఏ ఒక్క రోజైనా ఎమ్మెల్యే ఓదార్చారా, మనోధైర్యం కల్పించారా అని ప్రశ్నించారు. ఓట్లేసి ప్రజాప్రతినిధిగా ఆమెను ఎన్నుకున్న ప్రజలను గాలి కొదిలేసి హైదరాబాద్‌లో మకాం పెట్టారన్నారు. ఆదిరెడ్డి కుటుంబంలో ఒకరు మేయర్‌గా, మరొకరు ఎమ్మెల్సీగా, ఇంకొకరు ఎమ్మెల్యేగా ఏకంగా 16 సంవత్సరాలు పదవులు అనుభవించి నగరానికి, ప్రజలకు తీరని మోసం చేశారని ధ్వజమెత్తారు. వారికి అధికారం తప్పిస్తే ప్రజా సంక్షేమం, నగర అభివృద్ధి అక్కర్లేదన్నారు. తాను ఎంపీగా నేను చేసిన అభివృద్ధిని మీ ముందు ఉంచుతున్నానని, మీకు అభివృద్ధి నచ్చితే, తనపై నమ్మకం ఉంటే సిటీ ఎమ్మెల్యేగా తనను, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలపించాలని ప్రజలను కోరారు. ప్రజలకు అందజేసిన సేవకు నీతి అయోగ్ నుంచి భారత్ గౌరవ్ అందుకున్నానని, ఇది రాజమహేంద్రవరానికి గౌరవమని అన్నారు. కార్యక్రమంలో ఒకటో వార్డు ఇన్‌చార్జి ముప్పన ప్రభాకర్, 50వ వార్డు ఇన్‌చార్జి గుత్తుల మురళీధర్, పార్టీ నాయకులు పాలిక శ్రీను, నక్కా శ్రీనగేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



50వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న భరత్‌రామ్, గూడూరి శ్రీనివాస్

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం

- జగన్‌తోనే అన్ని వర్గాలకూ మేలు
- మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని మంత్రి, ఆ పార్టీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శాటిలైట్ సిటీలో సుమారు 300 మంది టీడీపీ కార్యకర్తలు గురువారం ఆయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మాజీ ఎంపీటీసీ పలివెల లలిత, పాట్నూరి ప్రతాప్, బాదర్ల నాగమణి ఆధ్వర్యంలో నక్కా కుమారి, బురద సరస్వతి, పాలాడి సుబ్బలక్ష్మి, పందిరిపల్లి బాలకుమారి, కొమ్మనాపల్లి గడ్డమ్మ, ఎలమర్తి సూర్య కుమారి, సల్లా వెంకట మహాలక్ష్మి, ఎల్లా ధనలక్ష్మి తదితరులు చేరారు. వారందరికీ మంత్రి వేణు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టో తేలిపోయిందన్నారు. సీఎం జగన్ వలనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. చంద్రబాబు మాటలకు ఒక్కసారి మోసపోయాం, మళ్లీమళ్లీ మోసపోబోమని ప్రజలు చెబుతున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారందరికీ తగిని గుర్తింపు ఉంటుందని, రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, శాటిలైట్ సిటీలోని పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ

సచివాలయ భవనం పరిశీలన

ధవళేశ్వరం: గ్రామంలోని సచివాలయం–4 భవనాన్ని గురువారం జిల్లా పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ మహ్మద్ అలీముల్లా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన టెక్నికల్ పాయింట్లను వివరించారు. ఆయన వెంట ఏఈ ఏ సంపత్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినతి, వెంకట్ రాజా ఉన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజయానికి కృషి చేస్తామని పార్టీ రూరల్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పేర్కొన్నారు. తిలక్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం గూడూరి శ్రీనివాస్‌ను కలిసి తమ సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో ఐదేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

6న ప్రధాని మోదీ రాక

కడియం: ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఈ నెల 6న వేమగిరి జాతీయ రహదారి పక్కన నిర్వహించే విజయ శంఖారావం బహిరంగ సభకు ప్రధాన మంతి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా పాల్గొంటారు. ఈ మేరకు అనువైన హెలీ ప్యాడ్ ప్రదేశాలను గురువారం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, జిల్లా పి.జగదీష్, ఏఎస్పీలు అనిల్ కుమార్, రాజకుమార్ రాజు, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

- కూటమిది అరచేతిలో వైకుంఠం
- దామిరెడ్డిపల్లిలో మంత్రి వేణుగోపాలకృష్ణ

కడియం: సీఎం జగన్ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలందరూ మెచ్చుకుంటున్నారని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని దామిరెడ్డిపల్లిలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమలు సాధ్యం కాని హామీలతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టోను చూస్తుంటే రంగుల కాగితంలా, అరచేతిలో వైకుంఠం చూపించినట్టు ఉందన్నారు. టీడీపీ మోసపూరిత హామీలకు, వైఎస్సార్ సీపీ విశ్వసనీయతకు మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ప్రజలను మోసం చేయడానికి వచ్చిన కూటమికి తగిన గుణపాఠం చెప్పేందుకు ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి, జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కాగా.. ప్రచారంలో తమ గ్రామానికి విచ్చేసిన మంత్రి వేణుకు స్థానిక మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. పార్టీ నాయకులు బుడ్డిగ పండు, రంపం గోపాలకృష్ణ, అరిగెల జాన్‌బాబు, చింతపర్తి చిట్టిబాబు, చింతపర్తి రాంబాబు, ధర్మాసనం వీరభద్రరావు, సందపునీడి గంగారావు, ముద్రగడ్డ ప్రసాద్, అన్నందేవుల శంకరం, పాదూరి మదు, కేదాసి సతీష్, ఎల్లే వీర్రాజు, కాకిలేటి సూరిబాబు, గణేశ్వరరావు, తాతపూడి రాంబాబు, పార్టీ పెద్దాపురం ఎన్నికల పరిశీలకులు గిరజాల వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షులు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలీ గోపాలం పాల్గొన్నారు.



దామిరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి వేణు, చిత్రంలో పార్టీ నాయకులు

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. బాలాజీపేటలోని గొందేశి మేన్షన్‌లో గురువారం సాయంత్రం బొమ్మూరు తెలుగు యూనివర్సిటీ పక్కన కాలనీలోని టీడీపీ, జనసేనలకు చెందిన 30 కుటుంబాలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వారందరికీ గొందేశి శ్రీనివాసులురెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కాలనీ వాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే గోరంట్ల ఏనాడు తమ సమస్యలను పట్టించుకోలేదన్నారు. మంత్రి వేణుగోపాలకృష్ణ, గొందేశి శ్రీనివాసులురెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరడం జరిగిందన్నారు. కాలనీ వాసులు దాసరి సుజాత, దొడ్డ త్రిమూర్తులు, గుడ్ల జీవన జ్యోతి, సత్యంశెట్టి నరసింహమూర్తి, కోనేటి వరహాలబాబు, బాదంపూడి సత్యవతి, గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో శ్రీనివాసులురెడ్డి

సెబ్ దాడుల్లో 48 మంది అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి విస్తృతంగా దాడులు నిర్వహించామని సెబ్ రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్.నెక్సన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకూ 228 కేసులు నమోదు చేశామని, వాటిలో 56 సారా, బెల్లపుఊటకు సంబంధించిన కేసులన్నారు. దాడుల్లో 4,654 లీటర్ల సారా, 200 కేజీల బెల్లం, 20 కేజీల అమ్మోనియా, 13 కేజీల ఈస్ట్, మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని 48 మందిని అరెస్టు చేశామని, 46,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. పన్నులు చెల్లించని (ఎన్‌డీపీఎల్) మద్యంపై రెండు కేసులను నమోదు చేసి 6.5 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అనధికార పన్ను చెల్లించిన మద్యంపై 162 కేసులను నమోదు చేసి, 162 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 159.5 లీటర్ల అక్రమంగా పన్ను చెల్లించిన మద్యం సీసాలను, 1099.55 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నామన్నారు. పాత నేరస్తులు 240 మందిని 110 సీఆర్‌పీసీ కింద తహసీల్దార్లకు బైండోవర్ చేశామన్నారు.

వేసవి ఎండలతో జాగ్రత్త



డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో



రాజమహేంద్రవరం రూరల్: ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులను ఆయన వివరించారు. ఎండాకాలంలో వేడి వల్ల చాలామందిలో మైకం, భయం, వికారం వంటి లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకూడదు. ముఖ్యంగా పగటి పూట 12 నుంచి 3 గంటల వరకు నీడపట్టున ఉండడం మంచిది. ఎందుకంటే ఈ సమయంలో సూర్య కిరణాల వేడి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఎండలోకి వెళితే అలసిపోయి కిందపడిపోవడం, చంచలంగా అనిపించడం, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు ఉంటాయి.

జాగ్రత్తలు పాటించాలి

- శరీరం ఎక్కువగా అలసిపోకుండా చూసుకోవాలి.
- ఇంటి నుంచి బయలుదేరే ముందు ఒక గ్లాసు నిమ్మరసం, చల్లని పాలు, మజ్జిగ లేదా లస్సీ వంటివి తాగాలి.
- తల, చెవులను కప్పుకున్న తర్వాత మాత్రమే ఇంటి నుంచి బయటకు వెళ్లాలి. గొడుగును ఉపయోగించాలి, వాటర్ బాటిల్ దగ్గర ఉంచుకోవాలి. తాగే నీళ్లలో కాస్త బ్లాక్ సాల్ట్, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపితే మంచిది.
- ఏసీ నుంచి డైరెక్ట్‌గా ఎండలోకి వెళ్లకూడదు. ఎండలో తిరిగివచ్చి డైరెక్ట్‌గా ఏసీ గదికి వెళ్లకూడదు. కొంచెం సమయం తీసుకున్న తర్వాత వెళ్లాలి. తద్వారా శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.
- స్థానిక సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్వాడీ కేంద్రాలలో అవసరమైన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి.

వడదెబ్బ – లక్షణాలు

- వడదెబ్బకు గురైతే కొంచెం మైకంతో పాటు తల తిరుగుతున్న అనుభూతి ఉంటుంది. ఏకాగ్రత ఉండదు. బలహీనత, కండరాల నొప్పి ఉంటుంది.
- విపరీతమైన దాహం, కడుపులో తిప్పుతున్నట్లు అనిపిస్తుంది. వాంతులు, విరేచనాలు అవుతాయి.

ప్రథమంగా చేయాల్సిన పనులు

- వడదెబ్బ లక్షణాలు కనిపించగానే ఆ వ్యక్తిని చల్లని చోటుకు చేర్చడంతో పాటు ఓఆర్‌ఎస్ ద్రావణం, గంటకు ఒక గ్లాసు చొప్పున నీరు తాగించాలి. బాగా ఎండలో పనిచేసే వారైతే గంటకు రెండు గ్లాసుల నీరు తాగించాలి. ఆ వ్యక్తి ఉన్న గదిని చల్లబరిచే ప్రయత్నం చేయాలి.
- శరీరాన్ని చల్లబరిచే పుచ్చకాయలు, కొబ్బరి నీరు, తాటి ముంజెలను ఇవ్వాలి. ఇంటిదగ్గర లభ్యమయ్యే ద్రవాలు, అవసరమనుకుంటే రెండు చెంచాల పంచదార, చిటికెడు ఉప్పు కలిపి తీసుకోవచ్చు.
- నీళ్లల్లో ముంచి పిండిన తడి వస్త్రాన్ని మెడ, ఛాతీ పొట్ట భాగాలకు చుట్టవచ్చు. అయితే అది కొంత పొడిబారగానే దాన్ని తీసివేసి వేరే వస్త్రం చుట్టాలి. అంతే తప్ప వేసిన వస్త్రాన్ని అలాగే ఉంచేయకూడదు.
- వడదెబ్బకు గురైన వాళ్లల్లో చాలామంది నీళ్లు తాగే స్థితిలో ఉండరు. అలాంటప్పుడు పీహెచ్‌సీలో ఐవీ ద్వారా ద్రవాలను ఎక్కించాలి.కోలుకున్న తర్వాత కూడా కొంతమందిలో మెదడు, గుండెపై వడదెబ్బ ప్రభావం ఉంటుంది. కొంత కాలం చికిత్స కొనసాగించాలి.

ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

కంబాలచెరువు: అకడమిక్ కేలండర్‌లో ప్రభుత్వం సూచించిన విధంగా ప్రైవేటు పాఠశాలలు పనిచేయాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రైవేటు పాఠశాలల కరెస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలలపై వచ్చిన సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చి, ఈ విద్యా సంవత్సరంలో అవి పునరావృతం కాకుండా చూడాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్‌కు ఎంపికైన విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. విద్యార్థుల ఆన్‌లైన్ హాజరును ఎట్టి పరిస్థితుల్లోనూ 10 గంటలలోపు విధిగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలు పూర్తి అయిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బస్సుల ఫిట్‌నెస్‌ను సెలవుల్లో నిర్ధారించుకోవాలన్నారు. విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యం నివ్వాలన్నారు. కార్యాలయానికి అందించాల్సిన రిపోర్టులన్నీ ఈ నెల 5వ తేదీలోపు సబ్మిట్ చేయాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ సక్కపల్లి శామ్యూల్ తెలిపారు. శుక్రవారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకూ మున్సిపల్ ఆఫీసు ఏరియా, శేషయ్యమెట్ట, కోర్లమ్మ పేట, తుమ్మలోవ, రామచంద్రరావు పేట ప్రాంతాలలో అంతరాయం కలుగుతుందన్నారు.

- ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ మంతెన గార్డెన్స్‌లోని వీధులు, సంగీత వెంకటరెడ్డి వీధులు, భాను టెక్స్‌టైల్స్ వీధి, ప్రగతి మార్గ్, షిరిడీసాయి మార్గ్, శ్రీగార్డెన్స్, కోకా భాస్కరమ్మ నగర్, పిల్లివారి స్ట్రీట్, జేఎన్ రోడ్, తోట రాములు నగర్, శ్రీనివాస నగర్, నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, శారదా నగర్, షీలా నగర్, గోపాల నగర్ పుంత, అద్దేపల్లి కాలనీ, వాకర్స్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు, మహాలక్ష్మి గుడి వీధులు, బైబిల్ ప్లేస్, వెంకటేశ్వరనగర్ డీవీబీ రాజు స్క్వేర్ 62 ఫ్లాట్లు, శ్రీ వేంకటేశ్వర నగర్, గెయిల్ ఆఫీస్ ఏరియా, ఆల్ బ్యాంక్ కాలనీ, వీఎల్ పురం, సత్యనారాయణపురం, సాయి బృందావన కాలనీ, మోరంపూడి సెంటర్, గణేష్ నగర్ ఏరియాలలో ప్రభావం ఉంటుంది.